

గౌలిగూడలో ఓటు హక్కును వినియోగించుకున్న హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 14 మే 2024 HYDERABAD


## వర్ష సూచన

సిటీబ్యూరో, మే 13(నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అయితే మొన్నటి వరకు బెంబేలెత్తించిన ఎండలు తగ్గుముఖం పట్టాయి. ఉష్ణోగ్రతలు దాదాపు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.9, కనిష్ఠం 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 38 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.





మోండా మార్కెట్ ఇస్లామియా హైస్కూల్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటేసిన సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



హబ్సిగూడలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటేసిన మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# తీర్పు నిక్షిప్తం!

- జూన్ 4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- గ్రేటర్‌లో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు

## స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు



సిటీబ్యూరో, మే 13, (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకొని తమ బాధ్యతను నెరవేర్చారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా నిక్షిప్తమయ్యాయి. ఓటరు తీర్పు ఎటు వైపు ఉన్నదో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో తేలనున్నది. అప్పటివరకు అన్ని పార్టీల నాయకుల్లో ఉత్కంఠ తప్పని పరిస్థితి నెలకొన్నది. పోలింగ్ ముగియగానే ఎన్నికల ఏజెంట్లు, అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు చేశారు. వాటిని కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు రాత్రికి రాత్రే తరలించి.. స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. లెక్కింపు కేంద్రాల్లోనే స్ట్రాంగ్ రూములు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచల సాయుధ పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టారు.

### ఉదయం 11 గంటల వరకు..

ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 11 గంటల వరకు మందకొడిగా సాగగా, మధ్యాహ్నం తర్వాత ఓటర్లు భారీ ఎత్తున పోటెత్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్లలో ఉన్న వారందరికీ అవకాశం కల్పించగా, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. విద్యావంతులు అధిక సంఖ్యలో పోలింగ్‌కు దూరంగా ఉండగా..బస్తీ వాసులు భారీగా తరలివచ్చారు. పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఒకటి, రెండు చోట్లా చోటు చేసుకున్న స్వల్ప ఘటనల మినహా గ్రేటర్‌లో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నది.



పికెట్ గాంధీయన్ స్కూల్‌లో ఓటేసిన కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

## ఓటేశారు.. చైతన్యం చాటారు

### సోషల్ మీడియాలో సెల్ఫీట్రెండ్

### పోలింగ్ కేంద్రాల బయట సెల్ఫీ బూత్‌లు

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): ఓటర్లలో చైతన్యం నింపేందుకు వేదికగా సోషల్ మీడియా మారింది. పోలింగ్ ప్రారంభమైన కొన్ని నిమిషాల నుంచే ఓటు వేసిన వారంతా సెల్ఫీలు తీసుకొని పోస్టులతో హోరెత్తించారు. 'నేను ఓటు వేశారు.. మీరు వేశారా'? అంటూ వాట్సాప్‌లో డీపీలు, పలు గ్రూపుల్లో సిరా చుక్క అంటించిన చూపుడు వేలును చూపిస్తూ.. పోస్టులు పెట్టారు. కేవలం ఫొటోలు మాత్రమే కాదు.. తాము ఓటింగ్‌పై చెప్పాలనుకున్న విషయాన్ని షార్ట్ వీడియోల రూపంలో వ్యక్తం చేశారు. ఓటు వేసిన కొందరు తమ ఫ్రెండ్స్, కాలనీకి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో ఓటింగ్‌పైనే ఎక్కువగా చర్చించారు. పోలింగ్ రోజు మంచి సందేశాన్ని ఇచ్చేలా.. సోషల్ మీడియాను ఓటర్లు వినియోగించున్నారనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. ఓటు వేయాలన్న ఆలోచన లేని వారిని సైతం కదిలించేలా.. పోస్టులు సోషల్ మీడియాలో చాలా కనిపించాయని, ఇది మంచి పరిణామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసేలా.. ఎన్నికల కమిషన్ సైతం ప్రత్యేకంగా ప్రచారం చేపట్టింది. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలతో వివిధ మాధ్యమాల్లోనూ ప్రచారం చేయించారు. ఓటు ఔనత్యాన్ని తెలిపేలా.. సందేశాలు, ఫోన్ కాల్స్‌తో పాటు సోషల్ మీడియా మాధ్యమం ద్వారా వినిపించేలా ప్రయత్నం చేశారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరిగేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల బయట ప్రత్యేకంగా సెల్ఫీబూత్‌లను 'దేశ్ కా గర్వ్' పేరుతో ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల లోపలికి వెళ్లే వారు స్మార్ట్‌ఫోన్లు తీసుకెళ్లకుండా పర్యవేక్షణ చేపట్టి, బయటకు వచ్చిన తర్వాత సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు తీసుకునేలా చర్యలు తీసుకున్నారు.




(రాత్రి 11.03 గంటలకు వచ్చిన వివరాల ప్రకారం మాత్రమే)

| నియోజకవర్గం | 2014 | 2019 | 2024 |
|---|---|---|---|
| సికింద్రాబాద్ | 53.04 | 48.09 | 45.62 |
| హైదరాబాద్ | 53.03 | 45.00 | 40.01 |
| మల్కాజిగిరి | 50.09 | 53.04 | 50.02 |
| చేవెళ్ల | 60.02 | 56.09 | 60.07 |

### అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా...

#### సికింద్రాబాద్ పార్లమెంట్

| | 2023 | 2024 |
|---|---|---|
| అంబర్‌పేట | 52.34 | 45.30 |
| జూబ్లీహిల్స్ | 52.13 | 39.38 |
| ఖైరతాబాద్ | 47.58 | 47.65 |
| ముషీరాబాద్ | 50.08 | 41.00 |
| నాంపల్లి | 45.8 | 47.30 |
| సనత్ నగర్ | 51.36 | 42.15 |
| సికింద్రాబాద్ | 54.12 | 46.57 |

#### హైదరాబాద్ పార్లమెంట్

| | | |
|---|---|---|
| బహదూర్‌పుర | 45.06 | 34.19 |
| చాంద్రాయణగుట్ట | 45.51 | 38.24 |
| చార్మినార్ | 43.39 | 38.00 |
| గోషామహల్ | 55.53 | 44.05 |
| కార్వాన్ | 48.92 | 40.57 |
| మలక్‌పేట | 41.56 | 37.84 |
| యాకత్‌పుర | 39.77 | 41.30 |

#### మల్కాజిగిరి పార్లమెంట్

| | | |
|---|---|---|
| కూకట్‌పల్లి | 54.07 | 43.23 |
| ఎల్బీ నగర్ | 59.73 | 46.11 |
| మల్కాజిగిరి | 54.29 | 51.97 |
| మేడ్చల్ | 62.79 | 57.20 |
| కుత్బుల్లాపూర్ | 57.45 | 49.10 |
| కంటోన్మెంట్ | 49.66 | 50.34 |
| ఉప్పల్ | 51.94 | 47.91 |

#### చేవెళ్ల పార్లమెంట్

| | | |
|---|---|---|
| చేవెళ్ల | 75.14 | 68.23 |
| మహేశ్వరం | 56.05 | 49.77 |
| పరిగి | 77.59 | 62.59 |
| రాజేంద్రనగర్ | 56.43 | 50.54 |
| శేరిలింగంపల్లి | 48.95 | 41.70 |
| తాండూర్ | 74.22 | 63.00 |
| వికారాబాద్ | 76.34 | 66.86 |



కౌకుంట్లలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, మే 13(నమస్తే తెలంగాణ): చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ..అహర్నిశలు కష్టపడ్డ బీఆర్ఎస్ కుటుంబసభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధంగా భావించి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ఓట్లు వేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'ఎన్నికల ప్రచార యజ్ఞంలో నా వెన్నంటి నిలిచిన ప్రజలకు, నన్ను ముందుండి నడిపించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను జీవితాంతం గుర్తుంచుకుంటా' అని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు.



దుండిగల్‌లో ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు

## హైదరాబాద్‌లోనే అత్యల్పంగా..

ప్రతి ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా నగర ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపలేదు. ముఖ్యంగా గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే పలు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పడిపోయింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన ఓటింగ్‌తో పోల్చితే పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ భారీగా పోలింగ్ శాతం పడిపోయింది. ఈసారి ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, సిటీలో ఓటు హక్కు ఉన్నా... తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కోసం సొంతూళ్లకు వెళ్లిపోవడంతోనే ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కావడానికి కారణాలుగా పేర్కొంటున్నారు. అదే విధంగా వరుసగా వచ్చిన వీకెండ్‌తో కూడా ఓటింగ్‌పై ప్రభావితం చూపిందని చెబుతున్నారు. ఇక గ్రేటర్‌లో ఐటీ ఉద్యోగుల ప్రభావం ఎక్కువగా ఉండే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ వంటి నియోజకవర్గాల్లోనూ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఓటు హక్కు వినియోగించిన వారి సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. ఈ మాత్రం పోలింగ్ నమోదు కావడానికి కొంత వాతావరణం కూడా సహకరించినట్లు చెబుతున్నారు. లేదంటే భారీ ఎండలకు గ్రేటర్ ఓటర్లు బయట అడుగు పెట్టే పరిస్థితి ఉండేది కాదని, ఉదయం నుంచి సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో కాస్తా ఓటర్లు ఊరట చెందే విధంగా పలు నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం నమోదైంది. ఎప్పటిలాగే ఓల్డ్ సిటీలోని పలు నియోజకవర్గాల్లో దారుణంగా ఓటింగ్ శాతం నమోదైంది. బహదూర్‌పుర నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 45.08 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకోగా, ఈసారి 34.19 శాతం మందే ఓటేశారు. ఇక దేశంలోనే అతి పెద్ద పార్లమెంటరీ నియోజకవర్గంగా గుర్తింపు పొందిన మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోనూ ఆశించిన స్థాయిలో పోలింగ్ కాలేదు.



